# నాకొక జీవితం చాలు



పి.ఎస్.నారాయణ

గంగాధర

"అమ్మా! నే నిది సహించలేనమ్మా !
నే నిప్పుడే వెళుతున్నాను పెండ్లి ఎలా అవుతుందో చూస్తాను ! . ఈ వివాహం జరగటానికి వీల్లేదు !" రాజశేఖరం ఆవేశంగా అన్నాడు

తల్లి దగ్గరకు వస్తూ అన్నది . "రాజా ! పెద్దదాన్ని చెబుతున్నాను విను . ఎవరి పాపాన వాళ్లే పోతారు మనం మధ్యలో కల్పించుకొని భారతి జీవితాన్ని ఎందుకు నాశనం చేయాలి ?... వద్దు నాయనా ! నేను చెబుతున్నాను విను !"

"భారతి జీవితం నాశనం అంటున్నావ్ ! ఒక వైపు శేషగిరి జీవితం అలా నాశనం అవుతుంటే నే నెలా చూస్తూ వూరుకోగలను ? రేపు వివాహం అయిన తరువాతయినా తెలియకపోదు . మిత్రుడివి నీవే యిలా మోసం చేశావే తెలిసీ దాచిపెట్టావే అని మొఖాన పట్టుకు అడిగితే నేనేం చెప్పేది ? అటు నా మిత్రుడిని మోసంచేస్తూ నా ఆత్మను నేను వంచించుకోలేను ! "ఒక్క క్షణం ఆగాడు. తల్లి మొఖంలోకి దీక్షగా చూస్తూ "లాభంలేదమ్మా ! వాడి తెలివితేటలు వాడిని యూనివర్సిటీలో ఫస్టుగా నిలబెట్టినయి .. వాడి అందం చుక్కల్లో చంద్రుణ్ణి గుర్తుకు తెస్తుందమ్మా . వాడు వాడు త్వరలో అమెరికా వెళ్లబోతున్నాడు వచ్చి ఎక్కడో ప్రొఫెసర్ అవ్వగలడు అటువంటి వాడి జీవితం ఇలా నాశనం చేయటం .. వాడి ఆశలను మొగ్గలోనే త్రుంచివేయటం .. వాడి కోరికలన్నీ గగన కుసుమాలు చేయటం నేను సహించలేను .. నేను చూడలేను !" తల విదిలించాడు

"రాజా !" గంభీరంగా అన్నది "శేషగిరి నీ మిత్రు డవ్వవచ్చు భారతి నా అన్నయ్య కూతురని గుర్తుంచుకో భారతి వివాహం నీవు ఆపటానికి వీల్లేదు .. ఆపలేవు .. అది జరిగి తీరాలి !"

రాజశేఖరం ముందుకువచ్చి, పిడికిలి బిగించి తల్లి మొఖంలోకి భయంకరంగా చూస్తూ, "ఆ నీ అన్నయ్యకూతురు భారతినే నీ కోడలిగా చేసుకోవటానికి ఎందుకు తిరస్కరించావో మరి ? ... చెప్పు అమ్మా చెప్పు ! ఆనాడు నీ అన్నయ్య వచ్చి కాళ్లా వేళ్లా పడుతూ బ్రతిమాలినప్పుడు ఒటికగుండెతో 'వీల్లేదు' అనే మాట తప్ప ఆ రోజుల్లో మరోమాట నీ నోటినుండి రాలేదే .. ఈనాడు నీ అన్నయ్యమీద, నీ అన్నయ్యకూతురు భారతి మీద అంత ప్రేమ, అంత జాలి ఎలా వచ్చింది ?" అన్నాడు రాజశేఖరం

ఆమె మొఖం తెల్లబడిపోయింది రెండు చేతుల్లోనూ మొఖాన్ని దాచుకొని వలవలలాడింది

రాజశేఖరం ఒక్క క్షణం ఆగాడు "అవునమ్మా భారతిని నీ కోడలిగా వూహించుకోలేకపోయావ్ ! . ఫిట్సు వచ్చే భారతిని నీ రాజశేఖరం ప్రక్కన భార్యగా నిలబెట్టలేకపోయావ్ ! అవునా ? . కానీ, ఈనాడు ఆ భారతే ఆ ఫిట్సుతో బాధపడే భారతే నా మిత్రుడు శేషగిరికి భార్యగా వెళుతున్నప్పుడు నీవు నిమ్మకు నీరెత్తినట్లులా ఉండగలుగుతున్నావ్ ? . వాడిని ఆ భయంకర నరకూపంలో పడకుండా చూడబోతున్న నన్ను ఎందుకు వారిస్తావ్ ? నీది గుండెగాదు నీది నీది "

ఆవేశం ఆపుకోలేకపోయాడు విసురుగా బల్లమీద పెట్టిఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను తీసుకున్నాడు. వడివడిగా రోడ్డుమీదకు నడిచాడు.

"రాజా ! ...."

" . . . . "

"నాయినా ! .... రాజా !"

* * *

"మావయ్యా !"

చేతిలోని సంచీని వాల్చిఉన్న మంచంమీద పడేసి హాల్లోకి నడిచాడు ఇరవైనాలుగు గంటలలో జరగబోయే ఒక పవిత్రకార్యం ఆగిపోయేందుకు గాను హవిస్సు వేయటానికి హాల్లో కాలు పెట్టాడు.

"మావయ్యా !"

అపుడే హాల్లోకి వచ్చిన అరవయ్యేళ్ళ వృద్ధుని చూస్తూనే, "శుభలేక పంపకుండానే ఎలా వచ్చానా అని విభ్రాంతి చెందుతున్నావా మావయ్యా ! నిజంచెప్పు ! భారతికి ఫిట్సు వస్తున్నయని శేషగిరికి ముందుగా చెప్పావా ? చెప్పు మావయ్యా . అది కనుక్కునేందుకే వచ్చాను . చెప్పు !"

ఆ వృద్ధుని మొఖం రాజశేఖరం ఆకారం చూస్తూ

"భారతీ !" పిచ్చిగా అరిచాడు.... ఆమె మాట లకు తల్లడిల్లిపోయి ఏడ్చాడు రాజశేఖరం !

వేయబోతున్న అడుగులను భారతి మాటలే తాళ్ళయి బంధించినయ్

"ఒక్క కోరిక ! చిన్న కోరిక ! లేదనకు బావా ! .... అది నాలో గూడుకట్టుకున్న కోరిక .. పీటల మీద కూర్చున్న మమ్మల్ని దీవించి వెళ్ళు బావా !"

"భారతీ !"

"మన కోరికలను విధి నలిపివేసింది ... మన జీవిత సుఖస్వప్నాలను దేవుడు కాలితో నలిపి వేశాడు కాదనను ... నీవు కాదనవు . ఎవరూ కాదనలేరు . కానీ, నా కోరికను నీవుమాత్రం కాదనకు బావా ! అదే నాకు తృప్తి అదే నా జీవన సౌభాగ్యం . అదే నా భావి జీవిత విజయానికి నాంది !"

ఆమె వెక్కివెక్కి ఏడ్వసాగింది

క్షణం క్రితం మావయ్యా మాటలనే ఈ పరిసరాల నుండి శేషగిరిని గూడా విధికి వదిలివేసి పారిపోదామనుకున్న రాజశేఖరం ఆమె మాటలకు వివశుడయిపోయాడు. వోడిపోయాడు అక్కడినుండి ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాడు — విధి బలీయమైనది !

* * *

కడుపులో దాచుకున్న రహస్యంతో విడిదింటికి వెళ్ళిన రాజశేఖరానికి పరిస్థితులే ఎదురుతిరుగగా విషం తిన్నట్టు గిలగిల లాడిపోయాడు !

శేషగిరి తనలోని నిప్పునుగాని చూడలేదుగదా ?

పూర్తిగా తెలిసినా ఇంత బాధ ఉండేదిగాదు తెలిసీ తెలియని అయోమయంలో పడి కొట్టుకుపోసాగాడు !

—రాజశేఖరం రాకకు శేషగిరి ఎంతగానో హర్షాన్ని వెలిబుచ్చాడు తండ్రికి పరిచయం చేశాడు 'ఇడుగో ! వీడే నా రాజశేఖరం !' అంటూ తల్లికి చూపించాడు అతడి ఆనందం వర్ణనాతీతం !

కాని, శేషగిరి ఆనందం రాజశేఖరాన్ని బల్లెమై పొడుస్తోంది !

# నాకీ జీవితం చాలు

"ఏమిటి, పెట్టె బెడ్డింగ్ లేక ఇట్లా వచ్చావ్ ? .... వెంటనే వెళ్ళిపోవా లనుకోవటం లేదుగదా ?"

"శేషగిరీ !" రాజశేఖరం గొంతు తడబడింది "ఈనాటివరకు మనం ఆత్మీయులమైన మిత్రులం ఈనాటినుండి . ఈనాటినుండి మనం బంధువులం కూడా శేషగిరీ !"

శేషగిరికి తను ద్రోహం చేస్తున్నాడు !

"రాజా ! " చటుక్కున భుజాలమీద చేతులు వేశాడు శేషగిరి.

"ఏమన్నావ్ ?...! మనం బంధువులం అవుతున్నామా ? . భారతి నీకేమౌతుంది ?"

"భారతి ! . ." మొఖం పక్కకు తిప్పుకున్నాడు "భారతి మా మావయ్య కూతురా శేషగిరి !"

"ఓ! నిజంగానా ?' శేషగిరి గొంతు పీర సించిపోయింది

రాజశేఖరం చటుక్కున తలెత్తాడు.

కన్నీటి భారతి కళ్ళముందు మెదిలింది పెదాలకు చిరునవ్వు పూసుకున్నాడు. తలవంచుకున్న శేషగిరి బుజం తడుతూ, "నీకు ఆనందంగా లేదూ శేషగిరీ నిజం ! ఈనాటినుండి మనం బంధువులం !" అన్నాడు

"అంతకంటే కావాల్సిం దేవున్నది భాయ్ !" వెనక్కు తిరిగాడు శేషగిరి

రాజశేఖరానికి అతడి వింత ప్రవర్తన అర్థంగాలేదు భారతి తన మావయ్యకూతురు అని చెప్పగానే అతడిలో ఎందుకు అంత మార్పు వచ్చిందో ఊహకు అతీతమే అయింది !

* * *

మంగళసూత్రధారణ జరిగిన తరువాత హృదయపూర్వకంగా దీవిస్తూ అక్షింతలు చల్లాడు దంపతులమీద రాజశేఖరం మద్రాసులో డాక్టరు చెప్పినట్లుగా ఈదినమే ఆమె సుఖమయ జీవితానికి మొదటిరోజు అవ్వాలని పదేపదే భగవంతుని ప్రార్థించాడు

ఈ వివాహం జరగకుండా చూడాలని వచ్చిన రాజశేఖరం హృదయపూర్వకంగా వధూవరులను దీవించి మరీ బయల్దేరాడు—తను అన్న మాటలు, తను చేసిన పని గుర్తుకొస్తుంటే అతడికే విచిత్రమేస్తోంది !

—కాని అతడికి అర్థంకానిదల్లా శేషగిరి తన యందు చూపిస్తున్న ముభావమే ! తననుండి తప్పుకు తప్పుకు తిరగాలనుకునే అతడి ధోరణి యే !

అతడికి అర్థంగాలేదు.

—దానికి తోడు ఆనాడు సాయంత్రం శేషగిరి మాటలు అతడిలో విచిత్ర భావనలను రేకెత్తించినయ్. ఆలోచనా వెల్లువలో గడ్డిపోచలా కొట్టుకుపోసాగాడు మనిషిని అనుమానపు భావనలు ఆవరించగా జీవితమే దుర్భరమనిపించింది . భరించలేక బాధపడ్డాడు. ఫలితమే మావయ్య ఎంతగా బ్రతిమలాడినా మరొక్కనాడు కూడా ఉండకుండా పెండ్లిపందిటిలోనుండి నడిచి బయటకు వచ్చేశాడు

—ఆసాయంత్రం—పెండ్లిపందిట్లో ముత్తయిదువులు ఆనందంగా తిరుగుతుండగా—పిల్లలు కేరింతలుకొడుతూ ఎగురుతుండగా—

ముభావంగా, భారంగా కూర్చున్నది ఇద్దరే ఇద్దరు—

మొట్టమొదటివాడు—రాజశేఖరం-తరువాత ఎదురుగా శేషగిరి !

ఉన్నట్టుండి శేషగిరి ముందుకువంగి అడిగాడు, "రాజా ! భారతిని నీ వెందుకు చేసుకోలేదు !"

రాజశేఖరం ఉలిక్కిపడ్డాడు. మొఖాన ఎవరో చాచి బలంగా కొట్టినట్లయింది శేషగిరి యిలా అడుగుతాడని అతడు కలలో గూడా అనుకోలేదు .. తనలో చిన్నచిన్న మొలకెత్తుతున్న అనుమానాలు బలమైన వేళ్ళను నాటుకుంటున్నాయి . అతడికి నోటివెంట మాట పెగల్లేదు ... తను ఏం చెప్పాలి ? . ఏలా చెప్పగలడు ?

ఫిట్స్ వచ్చే భారతిని మా అమ్మ కోడలిగా అంగీకరించలేక పోయిందని చెబుతాడా ?

శేషగిరికి చూచాయగా ఆ విషయం తెలిసే ఏమైనా అడుగుతున్నాడేమో ?

అతడికి అర్థంకాలేదు తల తిరగసాగింది

"కొన్ని కారణాలవల్ల .." అన్నాడు తలెత్తకుండానే


"అంత బలవత్తరమైన కారణాలా ?" సూదుల్లా మాటలను శరీరంలోకి పొడిచాడు

"శేషూ ! " నిగ్రహించుకోలేకపోయాడు కళ్ళు తిరిగినయి

తన హృదయానికి హృదయమైన శేషగిరిలో అనుమానపు బీజాలు అంకురించినయి తన అతడిలో నీచుడయి పోతున్నాడు తన సౌట్నా నీచత్వాన్ని అల్లుతున్నాడు. తనమీద హీనభావాల కేంద్రీకరిస్తున్నాడు

తన స్నేహానికిది పతనం తన నడుమ సన్నిహితత్వానికి ఈ లక్షణాలు కత్తెర్లు !

కాని, తనేం చేయగలడు ? . . తనేలా చెప్పగలడు ? .... తన మనస్సును ఏలా అదుపులో







# నాకీ జీవితం చాలు

పెట్టుకోగలడు ?

—ఆలోచ నొకటి తటుక్కున మెరిసింది.

"క్షమా ! .... అసలు భారతిమీద నా కలాంటి భావనే లేకపోయింది .. మే మెవ్వరం అలా వూహించుకోలేదు .... మా కుటుంబాల్లో ఎందు కనో అయిన సంబంధాలు కలిసిరాలేదు అలా చేసిన ఒకళ్లిద్దరూ సుఖపడకపోగా ఎవరో ఒకరు చచ్చిపోవటం తటస్థించింది.... " అబద్ధాల భవం తుల నడుమ నిట్టూర్పులు విడిచాడు. గుండె నిబ్బరం చేసుకున్నాడు.

ఇదంతా తను శేషగిరికి చేస్తున్న ద్రోహం .... ఎవరూ, ఏ మిత్రుడూ, హృదయానికి హృదయ మిచ్చిన ఏ మిత్రుడూ— వూహించనంత ద్రోహం !

కాని .... దీని కంతటికీ కారణం .... తను పరి స్థితుల చేతిలో కీలుబొమ్మవ్వటమే !

శేషగిరి ప్రశ్నే తను అక్కడనుండి పరారవ్వ టానికి కారణం ! పారిపోవటానికి కారణం.

రైలు ఎక్కి కూర్చొని ఎదురుగా ప్లాట్‌ఫారం మీద నిలబడి ఉన్న శేషగిరిని చూస్తూ, గుండె పగిలిపోతుండగా, "శేషగిరి ! భారతికి ఫిట్స్ వస్తుండటమే నేను ఆమెను భార్యగా స్వీకరించక పోవటానికి కారణం !" అని పెద్దగా అరుద్దా మన్నంత ఆవేశం వచ్చింది గాని, సిగ్గు, భయం అతడి నోటిని బంధించివేసినయి.

రైలుకూత కూసి పోతూవుంటే శిలావిగ్ర హంలా కూర్చొని శేషగిరి మొఖంలోకి చూస్తూ ఉండిపోయాడు—అతడి మిత్రుడు రాజశేఖరం !

*   *   *

"క్షమా !"

మిత్రమా ! ఏమని వ్రాసేది ? .... ఏమని వ్రాయగలను ?

నాలో పెరిగిపోతున్న ఈ లావాలాంటి భయం కర మోసం—మిత్రద్రోహం— నన్ను నిలువునా కూల్చివేస్తోంది. నన్ను మింగివేస్తోంది. నేను ఈ దుర్భరలక్షణాలను ఈ ఉత్తరం ద్వారా వదలించు కుంటున్నాను .... నా కీక తప్పదు భారతి జీవితపు ఆనందపు విలువమీదన్నా నా వరే నేని బాధ భరించలేను .... నా కదే దారి ... నా కంత కంటే దారిలేదు శేషగిరి ! ....

భారతి నా భార్య కాకపోవటానికి కొన్ని సంవత్స రాలబట్టి ఆమెను పట్టి పీడిస్తున్న ఫిట్స్ కారణం !....

నీవు పెళ్లితో నన్ను అడిగినా కావాలనే ఆత్మను వంచించుకొని మభ్యపెట్టాను !

క్షమించగలిగే శక్తి నీలో ఉంటే నన్ను క్షమించు.

ఇట్లు,
రాజు

ఉత్తరం వ్రాసిన అతడిని తెలియని తృప్తి ఆవరించింది

గుండెలమీద నుండి ఏదో బరువు తొలగిపోయి నట్లుగా ఫీలవసాగాడు.

లేచి చొక్కా తొడుక్కొని బయటకు నడి చాడు. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా తన చేతిలోని ఆ మోయలేని బరువును వదిలించుకోవాలి !

వడుస్తుంటే భారతి కన్నీటితో కాళ్లకు బంధాలు వేసింది. నీ చేతులమీదగా ఆనాడు నా వివా హము జరిపి, ఆ చేతులతోటే ఈరోజు నా జీవి తాన్ని త్రుంచివేస్తావా అంటూ నిలవేసి ప్రశ్నిం చింది !

తనేం చెప్పగలడు ? తనేం సమాధానం చెప్ప గలడు ?

ఆత్మక్షాళనము అనే కత్తెర్లతో ఆ బంధాలను త్రెంచివేసుకొని, కన్నీటి భారతిని కాళ్లకు దూరంగా లాగివేశాడు.

తన కంతకంటే మరో దారి లేదు !

భారతికి డాక్టరు చెప్పినట్లుగ తగ్గిపోతే ఏ భయమూ లేదు. తగ్గకపోతే ఈపాటికి ఆ విషయం శేషగిరికి తెలిసే ఉంటుంది.

ఇప్పుడు తను ఈ ఉత్తరం వ్రాయటంవలన ఎవరికీ హాని చేసినవాడవ్వటంలేదు — కాకపోగా తనలోని పాపాన్ని కడిగివేసుకుంటున్నాడు !

వివాహమయిన తరువాత తిరిగివచ్చిన రాజ శేఖరం మూడు నెలలు వేదనను, బాధను, భయాన్ని హృదయంలో పెంచుకొని ధైర్యంచేసి వదిలించుకున్నాడు ఆరోజు !

*   *   *

రాజశేఖరం ఆశలు అడియాశలయినయి.

శేషగిరి తనను తిట్టిపోస్తూ ఉత్తరం వ్రాస్తా డనుకున్నాడు. అలా వ్రాసి ఉన్నా ఎంతో తృప్తి పొంది ఉండేవాడు

కాని ఎందుకో వ్రాయలేదు— ఎందుకు వ్రాయ లేదు ?

అసలు జాబే లేదు.

వివాహమయి అప్పుడే అయిదు నెలలు గడిచి పోయింది. తను ధైర్యంచేసి వ్రాసిన ఉత్తరం గూడా అతడికి చేరి రెండునెలలయి ఉంటుంది.

తను క్షమించబడలేని ఒకపని చేసి, తమ నడుమ సాన్నిహిత్యాన్ని తిరిగి కలవలేని విధంగా త్రుంచివేశాడు.

ఆనాడు మావయ్యా, భారతీ కన్నీటితో తనని మౌనం చేశారు తనని బలిపీఠమెక్కించేశారు. తమ నడుమ స్నేహాన్ని సర్వనాశనం చేశారు.

శేషగిరికి దూరమయి, శేషగిరికి శత్రువుగా తనెలా బ్రతగ్గలడు? తనెలా జీవించగలడు?

అసలు శేషగిరి ఇన్ని రోజులబట్టి తన కెందుకు జాబు వ్రాయలేదు. వారం రోజులు తననుండి జాబు రాకపోతే గిబగిబలాడేవాడు నానా హంగామా చేసేవాడు. అటువంటివాడు తనను ఇన్నాళ్ళ మౌనంగా ఉన్నా, తన సంగతి పట్టించుకోనక్కే పూరుకున్నాడేం ?—జాబైనా రాయలేదే ?

అవును.. ఎలా వ్రాస్తాడు ?

అంత హృదయపూర్వకంగా ప్రేమించే రాజశేఖ రమే నిలువునా మోసం చేస్తే శేషగిరి ఇంకేం చేయగలడు ?—దుర్భరజీవితం గడపటంకన్నా అత డికి మిగిలిందేమిటి ?

ఒకవేళ భారతికి ఫిట్స్ తగ్గనయేమో ?

ఏమో ?

అలా తగ్గితే శేషగిరికి తనమీద ఎందుకు కోపం? ఎందుకు ఉత్తరం వ్రాయటంలేదు ?

ఏమో ... ఏమో .

ప్రపంచమే గిర్రున తిరుగుతున్న ట్లనిపించింది బలంగా కళ్ళు మూసుకున్నాడు రాజశేఖరం !

*   *   *




ఆనాడు ఆఫీసుకు వెళ్ళేటప్పటికల్లా హైద్రా బాదులో ఉన్న హెడ్డాఫీసుకు అర్జంటు పనిమీద పోయిరమ్మంటూ ఆర్డర్లు చేతి కిచ్చారు రాజశేఖరానికి.

వారంరోజులు పని !

తప్పేదేఉన్నది—పెట్టే బెడ్డింగుతో బయ ల్దేరాడు

ఒకవిధంగా హైద్రాబాదు వెళ్ళటం ఎంతో క్షేమంగా ఉన్నది— అటు బాధగాను, భయంగాను ఉన్నది.

అంతదూరం వెళ్ళి శేషగిరిని కలవకుండా తానెలా రాగలడు ?

శేషగిరిని తను చూస్తాడు ! ... ఇన్నాళ్ళూ తన కెందుకు ఉత్తరం వ్రాయలేదూ అని నిలదీసి ప్రశ్నిస్తాడు ! . —తను శేషగిరిని చూడకుండా ఉండలేడు . తను వెంటనే వెళ్ళి కలవాలి—ఒక విధంగా ఇదే క్రమ్ముకున్న మబ్బులను విడదీసి ఆహ్లాదాన్ని చేకూర్చే అవకాశం !—సదవకాశం !

హైద్రాబాదు వచ్చాడన్నమాటే గాని శేష గిరిని చూడాలంటే భయంవేసింది ఎక్కడ కన బడతాడో అని దొంగలాగా తప్పుకుని తిరిగాడు మనిషిని మానసిక బలహీనత ఆవ రించగా శరీరాన్ని నీరసం ఆవరించింది

ఒక్కొక్క క్షణంలో అనిపిస్తుంటుంది—శేష గిరి కోసరం కాకపోయినా, భారతి కోసరమైనా ఒక్కసారి వాళ్ళింటికి వెళ్ళిరావాలని . ఒక్కసారి భారతిని చూచిరావాలని కాని భారతి తనని గురించి ఏమనుకుంటుంది ?

తను ఆమె జీవితంలో నిప్పులు పోయ ప్రయ త్నించాడు ఆమె జీవితపు మలుపులో ఆనాడు చేయూతనిచ్చి ఈనాడు నట్ట నడిసముద్రాన నీటి లోకి అనహాయంగా త్రోసివేశాడు

అతడి తల తిరిగిపోసాగింది.

తనకు ఇద్దరూ ముఖ్యులే—తను ఇద్దరికీ అన్యాయం చేశాడు !

అసమర్థుడి జీవితానికి తను నిదర్శనం ! మిత్ర ద్రోహానికి తను నిదర్శనం మాటయిచ్చి నిల బెట్టుకోలేకపోవటానికి తన అసమర్థతే నిదర్శనం !

తను అసమర్థుడు—తను ఎందుకూ పనికిరాని పిరికిపంద !

* * *

శేషగిరిని చూస్తూనే రాజశేఖరం కొయ్యలా బిగుసుకుపోయాడు

వాడు తన శేషగిరేనా ? అందానికి ప్రతిబింబ మైనవాడు అలా నీరసించి, కృశించి ఎముకల గూడులా ఉన్నాడేం ?

జబ్బుగాని పడలేదుగదా ?

రెండు నిముషాలవరకు మాట్లాడలేకపోయాడు. విచిత్రంగా, కన్నార్పకుండావున్న అతడిని వింతగా చూస్తూ, "నేను రా! రాజశేఖరాన్ని!" అన్నాడు

"కూర్చో!"

కూర్చున్నాడు చచ్చిపోయి కూర్చున్నాడు రాజ శేఖరం

తను శేషగిరితో ఏం మాట్లాడగలడు? ఏమని మాట్లాడగలడు?

క్షణ క్షణం తను చేసిన మోసం, అన్యాయం అసహ్యపు చూపులతో పీడి పీడి కొస్తోంది

"శేషగిరీ నే నిజా బ్రతకలేను!" పెద్దగా అరిచా వినిపిస్తున్నది. "నే నీ బాధ భరించలేను!"

కొన్ని నిముషాలు వాళ్ళకు భయంకరభూతాలే అయినాయి!

శేషగిరి ఆకారం చూస్తుంటే భారతికి ఫిట్స్ తగ్గలేదనే అనిపించింది.

—ఆ కళ్ళల్లో వేదన, ఆమె మొఖంలో దిగులు, అతడిలో నిర్లిప్తత, స్పష్టంగా అతడిలోని బాధను తెలియబరుస్తున్నాయి!

భారతికి ఫిట్స్ తగ్గలేదు!

తన చేతులతో శేషగిరి జీవితాన్ని సర్వనాశనం చేశాడు.

అతడు ఈనాడు ఇలా కృంగి, కృశించిపోవ టానికి కారణం తను!

శేషగిరి లేచాడు.

"కేవలం చెప్పివస్తాను... అలా వెళ్దాం!"

అతడి మాటలకు దొంగలా వణికిపోయాడు రాజశేఖరం! . .ఇక్కడయితే భారతి వింటుందని బయటకు తీసుకువెళ్ళి నాలుగు మాటలు అడిగేం దుకా? కోపంతో తిట్టిపోసేందుకా?

తడబడ్డాడు రాజశేఖరం.

"లేదు శేషగిరి! నేను వెంటనే వెళ్ళిపోవాలి. ఆఫీసు పనిమీద వచ్చాను .... ఇక్కడ ఉండటా నికి వీల్లేదు!"

శేషగిరి తున్కహాసం చేశాడు

తరువాత ఒక్క క్షణానికి ఉన్నట్లుండి తల ఎగర వేశాడు కళ్ళను ఎర్రటి జీరలు అలుము కున్నయి. మనిషి బిగుసుకుపోయాడు. ముందుకు అడుగులువేస్తూ, "అయితే ఎందుకు వచ్చావ్?. ... ఎందుకు వచ్చావు నీవు రాజశేఖరం మా ఇంటికి . .. నీ శేషగిరి సౌభాగ్యాన్ని, నీ శేషగిరి సౌఖ్యాన్ని, నీ శేషగిరి అందాన్ని, నీ శేషగిరి ఆనందాన్ని చూద్దా మని వచ్చావా? . . .ఇక చూచావుగా వెళ్ళు...... ఊఁ. . వెళ్ళు .. వెళ్ళు రాజశేఖరం... .వెళ్ళిపో ... నీ మొఖం నేను చూడలేను . .వెళ్ళిపో, యు ఫెలో . వన్స్ గెటౌట్ !" పెద్దగా పిచ్చిగా అరిచాడు.

అతడి ఆకారానికి, మాటలకు నిర్ఘాంతపడయ్యాడు రాజశేఖరం శరీరం వణికింది గొంతు తడబడింది

వంగి వంగిగా, "నన్ను క్షమించలేవా?" గొణి గాడు

"యూ రాస్కెల్ గెటౌట్!"




ఉలుక్కిపడి వెనక్కి తిరిగాడు రాజశేఖరం. పరుగెడుతున్నట్లుగా గేటు దాటాడు. అడుగులు అతిరయంగా పడుతున్నాయి.

రాజశేఖరం తేలిపోతున్నాడు తనకు తాన శాస్తి జరిగింది. తన హృదయం ఇప్పు డెంతో తేలిగ్గా ఉంది. హాయిగా ఉంది. ఆనందంగా ఉన్నది. తనలో ఇప్పుడు ఏలాంటి బరువూలేదు. వేదనలేదు. బాధ లేదు. భయంలేదు.

తను చేసిన తప్పుకు— తాను ఫలితం అనుభ వించాడు! అది చాలు!

రైలెక్కాడు.

తన వూళ్ళో దిగాడు.

* * *

సరిగ్గా మూడు రోజుల తరువాత ఒకనాడు మధ్యాహ్నం ఆఫీసులో కాగితాల నన్నిటినీ ఎక్కడి వక్కడ వదిలేసి, గుడ్ల నీరు క్రుక్కుకుంటూ ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చాడు రాజశేఖరం. అతడి చేతిలో ఆరోజు టపాలో వచ్చిన ఉత్తరం నలిగి పోయి ఉన్నది అతడి హృదయం కరిగిపోయింది. అతడు నలిగిపోయి ఉన్నాడు.

ఇంటిముందు వరండాలో నిలబడి 'అమ్మా' పెద్దగా ఏడ్చాడు

ముందు వచ్చి నిలబడ్డ అమె ముందు చేతిలోని ఉత్తరాన్ని విసిరివేశాడు రాజశేఖరం.

అందులో ఇలా ఉంది

"బావా!

నాకు అనిపిస్తుంటుంది ఒక్కొక్క క్షణంలో— ఈ ప్రపంచమంతా ఇంద్రజాలం లాంటిదని! కోరికలు గుర్రాలై స్వారి చేస్తుంటే మనిషి మాన వత్వమే కోల్పోతున్నాడు— రేపటిమీద ఆశ మనిషిని అధఃపాతాళానికి తీసుకు వెళ్తుందని!

అది నిజం బావా!

మొన్నటి దినాన నీవు మా గడపలో కాలు పెట్టి, నాచేత వెళ్ళగొట్టించుకోబడినవాడు, నీవు వెనుదిరుగుతున్న సమయంలో నీ మొఖంలో నేనేదో తృప్తి చూచాను. అలాగే నిన్ను నానా దుర్భాషలాడి లోపలికి వచ్చిన ఆయన మొఖంలో అలాంటి తృప్తే చూచాను!

మీ ఇద్దరిలోనూ ఆ తృప్తిని చూచిన ఈ భార తికి ఈ జీవితంమీదే తృప్తి తీరిపోయింది—అది నీ కర్థంగాదు—

నీ ఉద్దేశ్యంలో— నేను నీ మిత్రుణ్ణి సర్వ నాశనం చేశాను— నీ మాటల్లోలాగా అత్యున్నత సోపానాల నెక్కవలసిన •నీ మిత్రుణ్ణి అధఃపాతా ళానికి త్రోసివేశాను అతని ఆనందాన్ని, సౌఖ్యాన్ని, సౌభాగ్యాన్ని, అతడికి మిగలకుండా లంగరించి త్రాగి వేశాను—నేను— ఫిట్స్‌తో బాధపడే భారతిని!

ఇది నీకు తెలిసిన సత్యం—నీ మిత్రుడి మొఖంలో నీవు చూచిన సత్యం!

కాని— జరుగుతున్న చరిత్రవేరు—రోజు రోజుకు 'ముందడుగు' వేస్తున్న మానవుల్లో ఇంకా 'శిలా కాలం' నాటి వ్యక్తులు ఉన్నారని నీకు తెలిసి ఉంటే—నీవు ఆనాడు మా నాన్నముందు—అంత ఆవేశాన్ని చూపించిఉండే వాడివేగాదు—పోనీయ్ గతాన్ని తవ్వుకొని నేను పొందేదేవిటి?


మూఢనమ్మకాలు జలగల్లా పట్టి పీడిస్తుంటే హితా హిత జ్ఞానాన్నే కోల్పోతున్నాడు మానవుడు—


అయినా భార్యకాదు నటి మానవుడు—ఈనాటి ప్రముద్ధుడు పెద్దైన తల నెరిసిన పెద్ద మానవుడు!

చాలా ఆశ్చర్యంగానూ, అసహజంగానూ, నమ్మ లేనిదిగానూ ఉండే ఈ విషయాన్ని నీకు వ్రాయ కుండా ఉండలేను బావా!—నీకు తప్ప మరెవరికీ వ్రాయలేను గూడా!

# నాకి జీవితం చాలు

నీ మిత్రులయిన, పూజనీయులయిన నా భర్త గారికి—మానవుడు గీసిన జాతకాల్లో రెండవ పెళ్లి వ్రాసి పెట్టారట— అందువా మొదటి వివాహమయిన మొదటి సంవత్సరం తిరక్కముందే




మొదటి భార్య వియోగాన్ని అనుభవించటమూ తాయ మేనటు!

—అందుకనే అసలు భార్యగా కావాల్సిన కల్యాణీ, అనే ఒక అందమైన మేనగోడలును జీవితాంతం భార్యగా అట్టి పెట్టుకునేందుకుగాను ఈ భారతిని బలియివ్వదలుచుకున్నారు!

హా.....ఆలోచించు బావా.....మానవుడు ఎంతగా పురోగమిస్తున్నాడో ఆలోచించు!

నేను ఇదంతా నీ మిత్రుల పెత్తిన రుద్దటం లేదు. ఒక విధంగా జాలి చెందుతున్నాను గూడా ఎందుకంటే ఆయనకు 'అంతగా' ఇలా చేయటం ఇష్టంలేకపోయినా ఆయనను 'ఒప్పుకునేటంతగా' మార్చి ఈ వివాహం చేశారు—నాచే పాదపూజ చేయించుకోదగ్గ ఘనులు—పెద్దలు—ఆయన తల్లి దండ్రులు!

కాని అనుకోకుండా—త్వరలో అమెరికా వెళ్ళ బోయే ఆయన జీవితంలో పిడుగు పడింది—ఆయన మొదటి భార్యగా—నేనైన భారతి ఆయన ఆప్త మిత్రుడైన నీ మేనగోడల్నవ్వటం తటస్థించింది.

ఆయన ఈ నిజాన్ని భరించలేకపోయారు. విలవిలలాడిపోయారు. గిజగిజలాడిపోయారు. బాధ, భయం, సిగ్గు, ఆవేదన, దిగులు భరించలేక చచ్చిపోయారు!

ఒక్కొక్కళ్ళు తను చేసిన తప్పుకు భయ పడి దొంగలాగా ప్రవర్తిస్తుంటారు—ఆయనా అలాగే ప్రవర్తించారు—నీయందూ అలాగే ప్రవ ర్తించారు—ఆనాడు నీవు మా గృహంలో కాలు పెట్టిననాడు ఆయనలో వెలువడిన ఆవేశానికి హేతువు ఆయనలోని పిరికితనమే—ఆయనమండి కోపంగ వెలువడిన మాటలు దానికి ప్రతిబింబమే!

నీకు చాలా పెద్ద ఉత్తరం వ్రాశానుగదూ బావా వ్వ!... ఎందుకిదంతా!.....

అందుకే...ఆనాడు నీకు మాట ఇచ్చానుగదూ కల్యాణు బొట్టుతో, కాళ్ళకు పారాణీతో, మాతృ వస్త్రాలతో......నీకు వాగ్దానం చేశాను. నీ మిత్రుడి ఆనందాన్ని, భావి జీవితపు ఆధిక్యాన్ని నేను హరించటమే నిజమయితే....అవును.. నిజం.. నేను ఈనాడు హరించటమే నిజమయింది బావా! మద్రాసులో డాక్టరు చెప్పింది అక్షరాలా నిజమే అయినా.... మరోవిధంగా ఆయన్ను హింసిస్తున్నాను అందుకే ఈ ఉత్తరం నీకుఅందేనాటికి ఈ భారతి జీవితం—మానవుడి పిచ్చిగీతలకు ఒక రూపాన్నిస్తూ (తప్పక!)—ఈ భూమ్మీద 'నిజం' గాకుండా— అనంతవ్యాప్తమయిన (ఏవో అక్కడే ఉంటుంద నాకు తెలియదు!) కలిసిపోయిఉంటుంది

నా కీ జీవితం చాలు బావా! . నా ఈ కొన్న జీవితంలోనే నేను ఈ ప్రపంచంలో ఎన్నో నేర్చు కున్నాను—ఎన్నో నేర్పించుకున్నాను—అందుకే ఈ సమయంలో ఒక్క బొట్టు కన్నీరు కార్చటంగూడ 'వృథా' అనిపిస్తోంది.....

—భారతి. ★